క్లుప్తంగా

63 మందికి వైద్య పరీక్షలు



తిరునాంపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పరమేశ్వర

యాడికి: మండలంలోని తిరునాంపల్లిలో గురువారం యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పరమేశ్వర ప్రజలకు వైద్యం చేశారు. 104 సాయంతో గ్రామానికి వెళ్లిన ఆయన బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, నడుము నొప్పులతో బాధ పడుతున్న 63 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామప్రసాద్ గౌడ్, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎం , ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం సభ్యులు

గార్లదిన్నె: కేంద్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, మార్కెట్‌లో ప్రైవేటీకరణ ఆపాలని అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు మాట్లాడుతూ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలన్నారు. అలాగే కార్మిక చట్టాలను సవరణ చేసి, రైతులకు నష్టాలు తెచ్చేలా నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. అదేవిధంగా 13 నెలల సుదీర్ఘ పోరాటలతో చట్టాలు వెనక్కి తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 20న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం సమ్మెకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి కృష్ణ, మండల కార్యదర్శి రాజశేఖర్, కమిటీ సభ్యులు మస్తాన్, రాము, ఖాదర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో హజరత్ బందే నవాజ్ ఉరుసు



షంషేర్ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కర్నూల్ రోడ్డులో వెలిసి నహజరత్ బందే నవాజ్ దర్గాలో గురువారం ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యుడు షఫి ఆధ్వర్యంలో దర్గా వద్ద నుంచి కోట వరకూ షంషేర్ ఊరేగింపుగా తీసుకెళ్లారు. మాజీ సర్పంచ్ హుస్సేన్ పీరా, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వెల్డింగ్ రవూఫ్, షఫి, మహ్మద్ తదితరులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో ముస్లింలు పాల్గొన్నారు.

సజావుగా మాన్యం వేలం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని పేట ఉమామహేశ్వరస్వామి మాన్యం గుత్త వేలం సజావుగా సాగింది. ఆలయ భూమి వేలం నుంచి వచ్చిన సొమ్మును ధూపదీప నైవేద్యాలకు వినియోగించేవారు. గత రెండేళ్లుగా గుత్త సక్రమంగా రాకపోవడం తో ఆలయ కమిటీ సభ్యులు నూతన కమిటీ ఎన్నుకుని గురువారం వేలం నిర్వహించారు. సుమారుగా 20 మంది రైతులు వేలంలో పాల్గొనగా రైతు జెడ్ నాగిరెడ్డి తొమ్మిది ఎకరాలను రూ.38 వేలు గుత్త చెల్లించేలాగా వేలం పాడినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఓటరు నమోదుపై అభ్యంతరాలుంటే తెలపండి



మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

శింగనమల: ఓటరు నమోదులో మార్పులు, చేర్పులుంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ బ్రహ్మయ్య సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యన ఫారం -6, 6ఏ, 7పై అవగాహన కల్పించారు. వీటిపై భ్యంతరాలుంటే తెలపాలన్నారు. ఓటరు నమోదుపై సలహాలు, సూచనలిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్వీ నారాయణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈతతో ఆహ్లాదం.. ఆరోగ్యం



తాడిపత్రిలోని ఓ స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

- మానసిక, శారీరక ఆరోగ్యానికి ఉపయోగకరం
- స్విమ్మింగ్ పూల్‌లకు ఎగబడుతున్న యువత, చిన్నారులు

తాడిపత్రి: సంపూర్ణ ఆరోగ్యానికి ఈతకు మించినది మరొకటి లేదు. గతంలో పల్లెటూర్లు, పట్టణాల్లో అక్కడక్కడా బావులు ఉండేవి. దీంతో పెద్దలు, చిన్నలు నిత్యం బావుల్లో ఈత కొట్టేవారు. మారుతున్న జీవనశైలి కారణంగా పట్టణాల్లో బావులు మచ్చుకు కూడా కనిపించని పరిస్థితి. పల్లెటూర్లలో కూడా దాదాపు 70 నుంచి 80 శాతం మేర బావులు కనిపించకుండా పోయాయి. దీంతో పల్లెల్లో అక్కడడక్కడా ఉన్న చెరువులు, కుంటలు మాత్రమే ఈతకు ఉపయోగకరంగా ఉంటున్నాయి. పట్టణ ప్రాంతాల్లో యువత ఈత కోసం స్విమ్మింగ్ పూల్స్‌ను ఆశ్రయిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. గతంలో జిల్లా కేంద్రాలు, పట్టణాలు, మున్సిపాలిటీలకే పరిమితమైన స్విమ్మింగ్ పూల్స్ నేడు మండల కేంద్రాల్లో సైతం ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ఈత కొట్టేందుకు నిర్వాహకులు గంటల ప్రాతిపదికన రుసుం వసూలు చేస్తున్నారు. ప్రసుతం వేసవి సెలవులు రావడంతో స్విమ్మింగ్ పూల్స్ వైపు చిన్నారులు, యువకులు, పెద్దలు దృష్టి సారిస్తున్నారు. ఈత చక్కని శరీరాకృతిని ఇవ్వడంతో పాటు, కీళ్ల నొప్పులు, రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల నియంత్రణకు దివ్య ఔషధనమని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రయోజనాలు...

చిన్నారులకు ఈత ఒక ఆట. పెద్దలకు ఈత అనేది ఆరోగ్య ప్రదాత. నిత్యం కనీసం 30 నుంచి 45 నిమిషాలు ఈత కొడితే ఎన్నో అనారోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చు. ముఖ్యంగా ఊబకాయం సమస్య ఉండదు. షుగర్, బీపీతో బాధపడుతున్న వారికి ఈత ఎంతో మేలు చేస్తోంది. గుండె పని తీరును మెరుగుపరచి, గుండె జబ్బులను నియంత్రిస్తుంది. కండరాలను బలంగా ఉంచడంతో పాటు కీళ్ల సంభంధిత సమస్యల నుంచి ఉపశమనం కల్పిస్తుంది. విపత్కర పరిస్థితుల్లో నీటితో ఇబ్బందులు వచ్చినప్పుడు ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు ఇతరులను కూడా రక్షించేందుకు ఈత వల్ల అవకాశం ఉంటుంది.

ఈత నేర్చుకుంటున్నా



నాకు ఈతంటే చాలా ఇష్టం. కానీ ఈత కొట్టేందుకు ఎక్కడా బావులు, కుంటలు లేవు. ఒక వేళ ఉన్నా అలాంటి ప్రదేశాలు ప్రమాదం. అందుకే ఖర్చు అయినా సరే స్నేహితులతో కలసి ఈత కొట్టేందుకు స్విమ్మింగ్ పూల్‌కు వెళ్తున్నా. వేసవి ఎండ నుంచి చల్లగా ఉండేందుకు ఈత కొట్టడం బావుంది.

– శ్రీనాథ్, బాలుడు, జీవీపీ కాలనీ

ఈత మంచి క్రీడ



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి క్రీడకూ మంచి ఆదరణ లభిస్తోంది. ప్రధానంగా అంతర్జాతీయ స్థాయిలో ఈతకు మంచి ప్రాధాన్యత ఉంది. ఈ క్రీడలో రాణించే వారు శారీరకంగా, మానసికంగా ఎంతో ధృడంగా ఉంటారు. కేవలం చిన్నారులే కాకుండా పెద్ద వారు కూడా ఈత కొట్టడం మంచిది.

– శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయుడు, పెద్దవప్పూరు

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీష్

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని, ఆలయంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ దేవస్థానానికి వేలాదిమంది భక్తులు వస్తుంటారని, భక్తుల సంఖ్యకు అనుగుణంగా వసతి గదులు, ఇతరత్రా సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదన్నారు. అలాగే ఆలయంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆలయంలో అడుగడుగునా అవినీతి రాజ్యమేలుతుందని, గతంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వ్యక్తి హుండీలో నగదును దొంగలించిన విషయం సీసీ కెమెరాల సాక్షిగా పట్టుబడిందన్నారు. ఇలాంటివి ఆలయంలో చాలా జరుగుతున్నాయన్నారు. ఆలయంలో కట్టుదిట్టమైన పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, శిథిలావస్థకు చేరిన వసతి గదులను నిర్మించి సదుపాయాలను పెంచాలని కోరారు. ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న విషయం చాలామంది భక్తులకు తెలియడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించి ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పత్తాలేని ఇరిగేషన్ అధికారులు

- కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ప్రజలు



ఇరిగేషన్ కార్యాలయం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఇరిగేషన్ శాఖ కార్యాలయం ఉంది. ఇక్కడ డీఈతో పాటు ఇద్దరు జేఈలు , సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇరిగేషన్ అధికారులు విధుల్లో ఉండటం లేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు మాసాలుగా అధికారులను కలవడానికి ప్రజలు ఇరిగేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఎపుడూ ఏ అధికారి కనిపించలేదని రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక్క జూనియర్ అసిస్టెంట్ మాత్రమే హాజరవుతున్నారు. ఇతర అధికారులెవ్వరూ కనిపించడం లేదు. ఇరిగేషన్ డీఈ, జేఈ ని వివరణ అడగటానికి ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

ఆరు నెలలుగా తిరుగుతున్నా..



గత ఆరు నెలలుగా పని మీద ఇరిగేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. ఒక్కసారి కూడా డీఈ కాని జేఈ కానీ కనిపించలేదు. మూడు సంవత్సరాలు వరుసగా చెరువుకు నీళ్లు వచ్చి వేరుశనగ పంట మునిగి పోయి దెబ్బతినింది. పరిహారం కోసం అన్ని ఆధారాలను డీఈ, జేఈకి అందజేశాను. కార్యాలయానికి రావాలని చెప్పారు. అయితే కార్యాలయానికి వెళితే అధికారులు విధుల్లో లేరు. ఫోన్‌లో కూడా అందుబాటులోకి రావడం లేదు.

–పుర్రా గోవిందరాజులు, రైతు, పాత కొత్త చెరువు

ఘనంగా ఆలయ ప్రారంభం



ఆంజనేయస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని వంకవీధిలో నూతనంగా నిర్మి ంచిన ఆంజనేయస్వామి ఆలయాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. తొలి రోజు ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. రంగు రంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. అనంతరం గోపూజ, గంగ పూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ పూజలను అర్చకులు ఆనందకుమార్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం ఆంజనేయస్వామి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. భక్తులు కాయ కర్పూరాలు సమర్పించారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

రేపు రాతిదూలం లాగుడు పోటీలు

పెద్దపప్పూరు: మండలంలోని కుమ్మెతలో చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఈ నెల 17న సేద్యపు ఎద్దుల కేటగిరిలో రాతిదూలం లాడుగు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. పోటీల్లో పాల్గొను ఎద్దుల యజమానులు 6301931092 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

గంగమ్మ ఆలయ పునఃప్రతిష్ట

తాడిపత్రిటౌన్: పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలో గురువారం గంగమ్మ ఆలయం పునఃనిర్మాణ సందర్భంగా కాలనీ వాసులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మానవతా వలంటరీ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని వివిధ గ్రామాల నుంచి పట్టణాలకు వచ్చే గ్రామస్తులు, కోర్టు, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడం కోసం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ సత్యప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి, ట్రెజరర్ శివసుబ్రమణ్యం, సభ్యులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు సోలార్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లిలో రెన్యూ విక్రమ్ శక్తి సంస్థ ఏర్పాటు చేయనున్న సోలార్ కాంప్లెక్స్‌కు శుక్రవారం మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేస్తారని రెన్యూ సంస్థ ప్రతినిధులు పృథ్వీ, ప్రకాష్ గురువారం తెలిపారు. సోలార్, పవన విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను మంత్రి ప్రారంభిస్తారన్నారు.

రెండు బైకుల ఢీ - ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో గురువారం రెండు బైక్‌లు ఢీ కొని సుప్రీత్ అలియాస్ బన్నీ, దినేష్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సుప్రీత్‌కు కాలు విరగడంతో వైద్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పందుల అపహరణ

శింగనమల: శింగనమలలో గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో గుర్తు తెలియని దొంగలు ఐదు పందులను దొంగతనం చేసినట్లు యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమోలో ఐదు మందికి దాకా వచ్చి, గ్రామంలో తిరుగుతున్న తమ పందులను అపహరించారన్నారు. పోలీసులు విచారణ చేపట్టారు.



రోడ్డు మధ్యలో ఎయిర్ వాల్వ్ నిర్మాణం కోసం తవ్విన గుంత

ప్రమాదకరంగా గుంత

గుంతకల్లుటౌన్: పట్టణంలోని గుంతబావి నుంచి మండీబజార్ మున్సిపల్ వాటర్ ట్యాంక్ వరకూ మెయిన్ పంపింగ్ పైప్‌లైన్ ఏర్పాటుకు పనులు ప్రారంభించి దాదాపు నెలరోజులయింది. పైప్‌లైన్ ఏర్పాటు వల్ల ఆయా ఏరియాల్లోని సీసీ రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. దీనికితోడు పైపులో గాలి పోవడానికి ఏర్పాటు చేసిన ఎయిర్ వాల్వ్‌కు చాంబర్‌ను నిర్మించి స్లాబ్ వేయడానికి తేజ స్వీట్స్ వద్ద రోడ్డు మధ్యలో వారం కింద నాలుగైదు అడుగుల లోతు తవ్విన గుంతను పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. అధికారులు వెంటనే ఎయిర్ వాల్వ్ చాంబర్, స్లాబ్ వేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



మదీనా మసీదు సమీపంలోని రోడ్డు మధ్యలో చెత్త వేసిన దృశ్యం

రోడ్డు మధ్యలో చెత్త కుప్పలు

గుంతకల్లు: స్థానిక తిలక్‌నగర్‌లోని మదీనా మసీదు సమీపంలోని రోడ్డు మధ్యలో చెత్త కుప్పలు ఉండటంతో వాహనాదారులు. పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు డ్రైనేజ్ కాలవలోని మురుగు, చెత్తను తీసి రోడ్డు మధ్యలో వేస్తున్నారు. అయితే వాటిని ఎప్పటికప్పుడు తొలగించకుండా అలాగే వదిలేయడంతో అటువైపుగా వెళ్తున్న ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారు. ప్రయాణికులు ముక్కు మూసుకుని రోడ్డు దాటే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి చెత్త కుప్పలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

‘ఉపాధి’ బిల్లులు చెల్లించండి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

శింగనమల: బుక్కరాయసముద్రం మండలంలోని గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు 10 వారాల నుంచి పెండింగ్ ఉన్న బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం బుక్కరాయసముద్రం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలు ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నాగలింగమయ్య మాట్లాడుతూ బిల్లులు చెల్లించకపోవడం వల్ల కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కూలీలకు బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శింగనమల: బుక్కరాయసముద్రం మండలంలోని పసూలూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓకు వినతి పత్రం అందజేశారు. కమిటీ సభ్యుడు ఎల్లన్న మాట్లాడుతూ పసూలూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

బైక్ బోల్తా -ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కాలేజీ సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద గురువారం బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో రామాంజనేయులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు బైక్‌లో పని మీద లచ్చానపల్లికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన రామాంజనేయులును స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువకుడి మృతి



ప్రవీణ్(ఫైల్)

గుత్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతిచెందాడు. వివరాలు.. పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఈ నెల 6న రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ప్రవీణ్, సురేష్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రవీణ్‌ను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.